

పులిచింతల సమాచారం

అచ్చంపేట: సాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 2,47,951 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 10 క్రస్ట్ గేట్లద్వారా 3,10,700 క్యూసెక్కులు వదిలారు.



ఘనంగా గంగమ్మ తల్లి వేడుకలు

వెల్దుర్తి: గుండ్లపాడులో గంగమ్మతల్లి దేవాలయ 19వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. భక్తులు మొక్కుబడులు చెల్లించి, నైవేద్యాలు సమర్పించారు.

ఎనిమిదో రోజుకు చేరిన దీక్ష



తెనాలిరూరల్: తెనాలి టెలిఫోన్ ఎక్ఛేంజీ ఆవరణలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటుకు అప్పజెప్పడాన్ని నిరసిస్తూ టెలికాం ఉద్యోగిని కె.పద్మావతి చేపట్టిన నిరసన సోమవారం ఎనిమిదో రోజుకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు, రేపు మంగళగిరిలో సీఎం పర్యటన



మంగళగిరి టౌన్: మంగళగిరిలో మంగళవారం, బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం అధికారులతో కలసి పరిశీలించారు. నగర పరిధిలోని సీకే కన్వెన్షన్‌లో జీరో ప్రావర్టీ పి–4 కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. సీటింగ్, సభాస్థలి, వీడియో గ్యాలరీ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నగర పరిధిలోని ఎస్ఆర్ఐ ఫ్లెటెడ్‌వర్ వద్ద ఉన్న మయూరి టెక్ పార్క్‌లో బుధవారం జరగనున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొననున్న దృష్ట్యా, అక్కడి ఏర్పాట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సమన్వయంతో విధులు నిర్వహించి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల కో–ఆర్డినేటర్, శాసనమండలి సభ్యులు పెందుర్తి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ప్లానింగ్ శాఖ జాయింట్ సెక్రటరీ శంకరరావు, సంయుక్త కలెక్టర్ భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, సీఎంఓ కార్యాలయ అధికారి ఇక్బాల్ సాహెబ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా పాల్గొన్నారు.

వినుకొండ ఫొటోగ్రాఫర్లకు అవార్డులు





వినుకొండ: ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో వినుకొండ ఫొటోగ్రాఫర్లు వంగపల్లి బ్రహ్మయ్య, కేసానుపల్లి సుబ్బారావులు అవార్డులు అందుకున్నారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఇతర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న ఇరువురిని వినుకొండ ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

విరిగిన ఇనుప గడ్డర్‌తో ఇబ్బందులు



తెనాలి రూరల్: తెనాలి–చందోలు మార్గంలోని వైకుంఠపురం రైల్వే వంతెన వద్ద తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో వంతెన దెబ్బతినకుండా ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో విరిగి కింద పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం మరమ్మతులు చేయించారు. తరచూ గడ్డర్ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గాంధీ ఆశ్రమానికి రూ.లక్ష విరాళం



తెనాలి అర్బన్: పెదరావూరుకు చెందిన షేక్ హనీఫ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బాషా మహాత్మా గాంధీ శాంతి వృద్ధాశ్రమ నిర్వాహణకు రూ.లక్ష చెక్కును నిర్వాహకులు వజ్రాల రామలింగాచారికి అందజేశారు. బుర్రిపాలెం రోడ్డులోని ఆశ్రమంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో షేక్ జానీ సైదా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణాకు తగ్గిన వరద

- సోమవారం సాయంత్రానికి 2.50 లక్షల క్యూసెక్కులు దిగువకు
- ఊపిరి పీల్చుకున్న లంక గ్రామాలు
- జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు వాన
- నిజాంపట్నంలో అత్యధికంగా 32.8 మిల్లీమీటర్ల వర్షం
- సగటున 11.99 మిల్లీమీటర్లు వర్షం



పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణా నదిలో వరద ప్రవాహం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 13న జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు కురవగా సోమవారం రాత్రి మరోమారు ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా నిజాంపట్నం మండలంలో 32.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా కర్లపాలెం, నగరంలలో 29.4 ఎంఎం, బాపట్లలో 24.8, పిట్టలవానిపాలెంలో 22.6, పర్చూరులో 21.2, రేపల్లె, సంతమాగులూరులలో 16.2, మార్టూరులో 12.4, బల్లికురవలో 12.2, చీరాలలో 9.2, అమృతలూరులో 8.2 మిల్లీమీటర్ల చొప్పున జిల్లాలో సగటున 11.99 ఎంఎం వర్షం కురిసింది.

కృష్ణాకు తగ్గిన వరద

కృష్ణా నదికి వరద తగ్గడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి సోమవారం ఉదయం దిగువకు 2.80 లక్షల క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు సాయంత్రానికి దీనిని 2.50 లక్షలకు తగ్గించారు. దీంతో కొల్లూరు మండలంలోని లంక గ్రామాలతోపాటు కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఎటువంటి వరద ముప్పు లేదని అధికారులు తెలిపారు.

ఈనెల 13 ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు కృష్ణా నదికి వరద పోటెత్తడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 5.80లక్షల క్యూసెక్కులు విడుదల చేసిన విషయం తెలిసిందే. కృష్ణానది ఎగువన భారీ వర్షాలు కురుస్తున్నాయన్న సమాచారంతో అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం సోమవారం జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని రద్దు చేసుకొని అందరూ వేమూరు నియోజకవర్గానికి తరలివెళ్లారు. కానీ వరద తగ్గుముఖం పట్టడంతో ప్రజలతోపాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



కొల్లూరు మండలం దోనేపూడి చినరేవు వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

కొల్లూరు: వరద ప్రభావిత ప్రాంతాలలో పటిష్ఠవంతమైన రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అధికారులను ఆదేశించారు. మండలంలోని దోనేపూడి కరకట్ట దిగువన చినరేవు లో లెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద ప్రవాహాన్ని ఎస్పీ సోమవారం పరిశీలించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ చర్యలు పటిష్టం

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

ఎస్పీ మాట్లాడుతూ వరద తీవ్రతపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావం ఉన్న ప్రాంతాలలో పశువుల కాపరులతోపాటు, స్థానిక ప్రజలు నదిలో దిగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవడంతోపాటు, గ్రామాలలో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆ మార్గంలో రాకపోకలు సాగించకుండా నిరోధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, కొల్లూరు ఎస్ఐ జానకిఅమరవర్ధన్ పాల్గొన్నారు.

తీర గ్రామాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి



కొల్లూరు: కృష్ణా నదికి వరద తీవ్రత పెరిగే సూచనలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలో వరద ప్రభావిత గ్రామాలలో చేపట్టాల్సిన చర్యలపై తీసుకోవాల్సిన చర్యలపై ఆమె అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎంపీడీఓలు తమకు నిర్దేశించిన గ్రామాలలో ప్రతి 25 కుటుంబాల సమాచారాన్ని సేకరించి, వారిలో ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల జాబితాను సిద్ధం చేసుకొని వారిని పునరావాస కేంద్రాలకు తరలించడానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వరదలు వచ్చిన సమయంలో ప్రజలు అసౌకర్యానికి గురవ్వకుండా నిత్యావసర సరకులు, కొవ్వొత్తులు, గ్యాస్ వంటివి ముందుగానే సమకూర్చుకునేలా గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాలను భయపెడుతున్న వరద

- ఉదయం 2.89 లక్షల క్యూసెక్కులు విడుదల
- మధ్యాహ్నానికి తగ్గిన వరద ఉధృతి
- లోతట్టు ప్రాంతాల్లో తగ్గని నీటి నిల్వలు



దోనేపూడి కరకట్ట దిగువన చినరేవు లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

కొల్లూరు: లంక గ్రామాల ప్రజలను వరద భయం వెంటాడుతుంది. ప్రకాశం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి నీటి విడుదల చేస్తున్న వరద నీటి ప్రవాహం ఇరవై రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వస్తోంది. తెలంగాణాతోపాటు, ఎగువ ప్రాంతాలలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద పోటెత్తుతుంది. నాలుగు రోజుల కిందట 5.75 లక్షల క్యూసెక్కులు నదికి రావడంతో లోతట్టు ప్రాంతాలలోకి వరద నీరు చొచ్చుకువచ్చింది. పంటలు ముంపునకు గురయ్యాయి. ఆ తర్వాత వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. తిరిగి ఆదివారం రాత్రి నుంచి పెరుగుతూ వచ్చింది. సోమవారం ఉదయం కృష్ణా నదికి 2.89 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. అయితే వరద నీటి విడుదల క్రమంగా తగ్గుతూ 2.50 లక్షలకు చేరింది. నదిలో ప్రవాహ తీవ్రత కొంత మేర తగ్గింది.

లోలెవల్ వంతెన మీదుగా ప్రవాహం

కృష్ణా నదిలో కొనసాగుతున్న వరద ప్రవాహం కారణంగా లోతట్టు ప్రాంతాలలోకి వరద నీరు చేరుతుంది. నాలుగు రోజుల కిందట వచ్చిన వరద కారణంగా మండలంలోని పెసర్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం ప్రాంతాలలోని ఇటుక బట్టీల మట్టి కోసం తవ్విన గుంతలలోకి వరద నీరు భారీగా చేరింది. ప్రస్తుతం విడుదల చేస్తున్న వరద నీరు కారణంగా గాజుల్లంక చిన రేవు నుంచి ప్రవహిస్తున్న వరద నీటి తీవ్రత అధికమైంది. దీంతో దోనేపూడి కరకట్ట దిగువ నున్న లోలెవల్ వంతెన మీదుగా నీరు ప్రవహిస్తుంది. లోలెవల్ వంతెనపై నుంచి వరద నీటి ప్రవాహం కారణంగా మండలలోని పోతార్లంక, తోకలవారిపాలెం, తిప్పలకట్ట, కిష్కింధపాలెం, జువ్వలపాలెం, తడికలపూడి తదితర గ్రామాల ప్రజలు గాజుల్లంక, భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామాల మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి తలెత్తింది.

కరకట్ట భద్రతకు పటిష్ట చర్యలు

ఆర్‌సీ ఏఈఈ నాగేశ్వరనాయక్



ఓలేరు వద్ద కరకట్టను పటిష్టం చేసేందుకు ఇసుక బస్తాలు వేస్తున్న సిబ్బంది

రేపల్లె: బలహీనంగా ఉన్న కృష్ణా కరకట్టలను పటిష్టపరిచేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్‌సీ ఏఈఈ నాగేశ్వరనాయక్ చెప్పారు. ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీరు వస్తున్నందున సోమవారం ఆయన ఓలేరు నుంచి లంకెవాని దెబ్బ వరకు కరకట్టను పరిశీలించారు. బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించారు. ఓలేరు పల్లెపాలెం వద్ద బలహీనంగా ఉన్న కరకట్టను పటిష్ఠ పరిచే చర్యలు చేపట్టారు.

వరద ఉధృతి పెరిగినా కరకట్టలకు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పటిష్ఠపరుస్తున్నట్లు చెప్పారు. ముందస్తుగా ఇసుక బస్తాలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2009 వరదల సమయంలో కోతకు గురైన కరకట్ట ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు అధిక మొత్తంలో వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. సుమారు ఏడు నుంచి ఎనిమిది లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున కృష్ణా నదిలోకి చాపల వేటకు మత్స్యకారులు వెళ్లరాదని సూచించారు. నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: రైతులకు ఎరువుల కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో సోమవారం అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏడీఏలతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఒక ఎకరానికి డీఏపీ, యూరియా ఎంత మోతాదులో అవసరమవుతుందో తగు వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. షాపులలో డీఏపీ, యూరియా తగినంత అందుబాటులో లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో డీఏపీ, యూరియా తగినంత అందుబాటులో ఉందని, భయపడాల్సిన పనిలేదని కలెక్టర్ తెలిపారు. ఎరువులను అధిక ధరలకు అమ్మితే ఫిర్యాదు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. అన్ని సొసైటీలకు వెంటనే యూరియాను అందజేయాలని మార్క్‌ఫెడ్ డీఎంకు సూచించారు. బుధవారం నుంచి అన్ని రైతు సహాయ కేంద్రాలలో యూరియా పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో విలేజ్ అసిస్టెంట్లు ఇంటింటికి వెళ్లి డీఏపీ, యూరియా తగినంత ఉందని, వాటిని ముందస్తుగా నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, డీఏపీ వాడకం వలన భూములలో పాస్పేట్ ఎక్కువగా ఉందని, డీఏపీకి బదులుగా 20–20 వాడుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వరద ప్రాంతాల్లోని రైతులకు యూరియా అవసరం ఎక్కువగా ఉంటుందని, వారికి ఎక్కువ యూరియాను సరఫరా చేయాలని అధికారులు సూచించారు.

బర్లీ పొగాకు సాగు నిషేధం

రాష్ట్ర ప్రభుత్వం బర్లీ పొగాకు సాగుపై నిషేధం విధించినట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. రైతులు బర్లీ పొగాకును అధిక సంఖ్యలో సాగు చేయడం వలన కొనేవారు లేక చాలా ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. బర్లీ పొగాకుకు మార్కెట్లో డిమాండ్ లేదని అన్నారు. కొన్ని కంపెనీల దళారులు రైతులను పొగాకు సాగుకు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కంపెనీలు రైతులను మభ్యపెట్టే చర్యలను అణచివేయాలని అధికారులకు సూచించారు. ఏ గ్రామంలోనైనా పొగాకు సాగు చేసినట్లు తెలిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అందుబాటులో ఎరువులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో 7,750 మెట్రిక్ టన్నుల యూరియా, 2,702 టన్నుల డీఏపీ,614 ఎంవోపీ,7,612 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 2,580 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎం.సుబ్రమణ్యేశ్వరరావు తెలిపారు. రైతులు కలుపు మందులో యూరియా కలిపి వాడకూడదన్నారు. ఇసుకతో మాత్రమే కలిపి పిచికారి చేయాలన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కుగాను 98,898 హెక్టార్లలో వరి పంట సాగు చేయాల్సివుండగా, ఇప్పటివరకు 41,027 హెక్టార్లలో సాగైందన్నారు. 1,31,258 హెక్టార్లలో అన్ని రకాల పంటలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 44, 683 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్‌గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి శ్యాంసన్, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ,, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, డిప్యూటీ కలెక్టర్ లవన్న, చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోకు జీవం పోస్తాడు పీవీఎస్



అంతర్జాతీయ స్థాయిలో పివిఎస్ నాగరాజుకు గోల్డ్‌మెడల్ సాధించిన ఫొటో

ఫొటోగ్రఫీలో పీవీఎస్ నాగరాజుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం



కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పీవీఎస్ నాగరాజు

బాపట్లటౌన్/బాపట్లఅర్బన్: జీవితంలోని మధుర స్మృతులన్నీ దాచుకునే దృశ్య సంచిక ఫొటో..బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పీవీఎస్ నాగరాజు తన చేతిలోని కెమెరాను క్లిక్ మనిపిస్తే చాలు...మండలం నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ఏదో ఒక అవార్డు సాధించడం ఖాయం. గ్రామీణ ప్రాంతాల ప్రజల స్థితిగతులు, జీవ వైవిధ్యం, ప్రకృతి సౌందర్యాలు, గిరిజనుల జీవన విధానం, భారతీయ సంస్కృతి, గిరిజనుల జీవన పోరాటం, తీరప్రాంతాల్లోని మత్స్యకారుల జీవన స్థితిగతులు, గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పడేపాట్లు ఇలా సహజ సిద్ధంతో కూడిన ఛాయాచిత్రాలను తన కెమెరాలో బంధించడం అతని అలవాటు. పీవీఎస్ తీసిన ఫొటోలకు ఇప్పటివరకు 207 అవార్డులు లభించాయి. వాటిల్లో రాష్ట్రస్థాయిలో 19, జాతీయస్థాయిలో 105, అంతర్జాతీయ స్థాయిలో 83 చొప్పున అవార్డులు లభించాయి. తాను తీసిన ఛాయాచిత్రాలకు లభించిన అవార్డులను గుర్తించిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 2024లో పీవీఎస్ నాగరాజుకు డాక్టరేట్ అందజేశారు.

ముందుకు రాని లైసెన్స్‌దారులు

మొదటి రోజు నిల్



చీరాల: కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా లైసెన్స్ ఫీజు అడ్డగోలుగా పెంచడంతో టెండర్లు దాఖలు చేసేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. హైదరాబాద్ వంటి భాగ్యనగరంలో సంవత్సరానికి బార్ లైసెన్స్ రూ.45 లక్షలు ఉండగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్కొక్క బార్‌కు రూ.75 లక్షలు కడితేనే టెండర్లు వేయాలని హుకుం జారీ చేసింది. దీంతో బార్ షాపుల యజమానులకు చిర్రెత్తుకొచ్చింది. దీనికి తోడు అమ్మిన అమ్మకాలలో 50 శాతం టాక్స్‌లు వసూలు చేస్తుంది. రెండు నెలల కాలపరిమితిలో ఈ టాక్స్ విధిస్తుంది. దీనికి తోడు రూ.100 లోపు చీప్ క్వార్టర్‌లు అమ్ముకోవడానికి వీలులేదు. ఇది కేవలం వైన్ షాపుల్లోనే అమ్మాలి. అలానే పార్సిల్ సర్వీస్ ఉండదు. సోమవారం నుంచి బార్‌లకు టెండర్లు ప్రక్రియ మొదలు కాగా చీరాలలో ఒక్క టెండరు రాలేదు. గతంలో చీరాల ప్రాంతంలో ఆరు బారు షాపులుండగా నష్టాల బారిన పడి రెండు మూసివేశారు. ప్రస్తుతం నాలుగు నడుస్తుండగా కూటమి ప్రభుత్వం మరో బారును అదనంగా పెంచింది. అంటే చీరాలకు ఏడు బారులను నిర్వహించాలని ప్రభుత్వ నిబంధన. దీంతో ఈ వ్యాపారం చేయలేమని ప్రభుత్వం బార్ లైసెన్స్‌ల విధానం మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో 17 బార్‌లు ఉండగా అదనంగా రెండు బార్‌లను గౌడ కులస్తులకు కేటాయించింది. కొన్ని సంవత్సరాలుగా బార్‌లను నడుపుతున్న యజమానులు కూటమి ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతుందని ఆరోపిస్తున్నారు. వైన్ షాపులకు 25 శాతం పర్సంటేజి ఇస్తామని, ఆ తర్వాత 9 శాతం మాత్రమే ఇచ్చారు. దీంతో వైన్ షాపుల యజమానులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగడంతో 14.5 శాతం ఇచ్చారు. మద్యం పాలసీలోనే కూటమి ప్రభుత్వం దోపిడీ, దౌర్జన్యంగా వసూళ్లకు పాల్పడుతుందని వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వం దోచుకుంటుంది..



కూటమి ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతుంది. ఇష్టానుసారంగా లైసెన్స్‌లు పెంచి దోచుకుంటుంది. హైదరాబాద్‌లో ఏడాదికి బార్ లైసెన్స్ రూ.45లక్షలు ఉండగా కూటమి ప్రభుత్వం ఒక్కో బారుకు రూ.75 లక్షలు కడి తేనే టెండర్లు వేయాలని హుకుం జారీ చేసింది. ఇది పక్కా దోపిడీ.

సూరగాని చెంచుబాబు, బార్ యజమాని

26 వరకు గడువు

కొత్త బార్ టెండర్లను ఈనెల 26వ తేదీ వరకు గడువు ఇచ్చారు. సోమవారం టెండర్లు వేసేందుకు ప్రారంభం కాగా ఒక్క టెండరు కూడా రాలేదు. జనాభా నిష్పత్తి ప్రాతిపదికన ప్రభుత్వం మరో బార్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. 28న టెండర్ల బాక్సు తెరుస్తాం. ఈనెల 26వ తేదీ వరకు గడువు ఉంది.

– పీ.నాగేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ, చీరాల

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

తాడికొండ: అమరావతిలోని వేంకటపాలెంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆగస్టు 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. లోక కల్యాణార్థం మొదటిసారిగా ఆలయంలో పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం అర్చకులు విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, ఆచార్య రుత్విక్ వరణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు. 19వ తేదీ ఉదయం పంచగవ్యారాధన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ఠ అధివాసం, సర్వదైవత్య హోమం చేపడుతారు. 20న ఉదయం పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, ప్రధాన హోమాలు, స్నపన తిరుమంజనం, పవిత్రాభిమంత్రణ, పవిత్ర సమర్పణం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, మహా శాంతి హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. 21వ తేదీ ఉదయం పుణ్యాహవచనం, యాగశాల వైదిక కార్యక్రమాలు, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, కుంభ సమర్పణం, విశేష ఆరాధన, ఆచార్య, ఆగమ సలహాదారు, ఋత్విక్కులకు బహుమానం, యాజమాన ఆశీర్వాచనం చేపట్టనున్నారు.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,541
అమ్మకాలు	42,285
నిల్వ	7,029

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,500
నంబరు–5	10,000–13,200
341	10,000–14,600
సూపర్ –10	10,000–13,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–14,200
నంబరు–5	10,000–13,500
341	11,000–14,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,500
బాడిగ 5531	10,000 – 13,000
దేవనూరు డీలక్స్	10,000 – 13,300
ఆర్మూర్	9,800 – 11,200
తాలుకాయలు	6,000 – 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్–1	10,000–13,200
బాడిగ – 5531	10,000–12,100
ఆర్మూరు	10,200 – 13500
తాలు	5,300 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

ద్విచక్ర వాహన దొంగలు అరెస్టు

రూ.9.6 లక్షల విలువైన 10 వాహనాలు స్వాధీనం

రేపల్లె: ద్విచక్ర వాహన దుండగులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం దుండగుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన పట్టణంలోని రింగు రోడ్డు సెంటర్‌లో బొర్రా కృష్ణ తన ద్విచక్ర వాహనాన్ని సెంట్రల్ పార్కింగ్ చేసి దుకాణానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి తన వాహనం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రేపల్లె–పెనుమూడి రోడ్డులో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొల్లూరుకు చెందిన ముగ్గురు బాలురు పట్టుబడ్డారు. వారిని విచారించగా ద్విచక్ర వాహనాన్ని దొంగిలించడంతోపాటు పలు నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.9.6 లక్షల విలువైన 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ వీరికి గతంలో నేర ప్రవృత్తి లేదని పేర్కొన్నారు. డబ్బుల కోసం ఇటువంటి నేరాలకు పాల్పడటం ప్రారంభించారన్నారు. యూట్యూబ్‌లో వచ్చే వివిధ అంశాలను పరిశీలించి ఈ దొంగతనాలు సులభంగా చేయడం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను గమనిస్తూ ఉండాలని చెడు అలవాట్లకు దూరంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

రోగులకు సహనంతో సేవలు అందించాలి

జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి పద్మావతి

రేపల్లె: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు సహనంతో వైద్య సేవలను అందించాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి పద్మావతి పేర్కొన్నారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు అధికంగా అయ్యేలా పనిచేయాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నందున జాగ్రత్త వహించి వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యశాలలో సదుపాయాలన్నీ అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వైద్యశాలలో రికార్డులు పరిశీలించి వివిధ రోగుల గదులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ సుధాకరం, వైద్యులు గణేష్, జీవన్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి పద్మావతి

బాపట్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

- అపరిశుభ్రంగా ఖాళీ స్థలాలు ఉంటే నోటీసులు ఇస్తాం
- మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల అర్బన్: వర్షాలు, వరదలు దృష్ట్యా పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని పలు డ్రెయినేజీలు, నీటి కుంటలలో దోమలు ఉత్పత్తి జరగకుండా గంబూషియా చేప పిల్లలను సోమవారం వదిలే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఖాళీలను యజమానులు శుభ్రం చేయించుకోవాలని, పిచ్చిమొక్కలు, అపరిశుభ్రంగా ఉంటే సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. పురప్రజలు కూడా మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కరుణ, నజీర్ ఉన్నారు.


మురుగునీటిలో గంబూషియా చేప పిల్లలను వదులుతున్న మున్సిపల్ అధికారులు

సిండి'కేటు'గా గండి !

- కొల్లి శారద హోల్‌సేల్ మార్కెట్‌లో షాపుల వేలానికి అడ్డంకులు
- కార్పొరేషన్ ఆదాయం గండి కొట్టాలని లీజుదారుల ఎత్తుగడ
- సోమవారం జరిగిన వేలం పాటకు దూరం
- బైపాస్‌లో మార్కెట్ ఏర్పాటుకు శంకుస్థాపన


కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆదాయానికి గండి కొట్టేందుకు కొల్లి శారదా మార్కెట్ లీజుదారులు సిండికేట్ అయ్యారు. లీజు గడువు గత ఏడాది మేతో 25 సంవత్సరాలు పూర్తయినా షాపులను విడిచి పెట్టడం లేదు. అప్పటి నుంచి హైకోర్టును ఆశ్రయించి, సంవత్సరన్నరకు పైగా షాపుల్లో దర్జాగా పాగా వేశారు. ఎలాగైనా తమకే రెన్యువల్ చేయాలని ఎమ్మెల్యేలు, మంత్రి, ఎంపీల ద్వారా నగరపాలక సంస్థ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. మంత్రి సూచనతో ఈ నెల 12, 13, 14వ తేదీల్లో జరగాల్సిన వేలం పాటను గవర్నర్ పర్యటనను సాకుగా చూపి నిలిపివేశారు. దీనిపై సాక్షి దినపత్రికలో 'గలీజు'లో కూటమి కుయుక్తులు అనే కథనం ఈ నెల 11న ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నిబంధనల మేరకే 81 షాపులకు వేలం పాట నిర్వహించాలని ఆయన సూచించడంతో 18, 19, 20వ తేదీల్లో షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు.

రెండు వర్గాలుగా చీలిన అసోసియేషన్

ప్రస్తుతం మార్కెట్‌లో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా అసోసియేషన్ నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఇందులో మెజార్టీ వర్గం నేతలు వేలం పాటకు దూరంగా ఉండాలని హుకుం జారీ చేశారు. దీంతో సోమవారం జరిగిన పాటకు పాత లీజుదారులు హాజరైనప్పటికీ, వేలం పాటలో పాల్గొనలేదని సమాచారం.

వేలం పాటలో కూటమి కార్పొరేటర్ల హవా

ఒక పక్క పాత లీజుదారులంతా మార్కెట్‌ను గుంటూరు నగరం నుంచి ఏటుకూరుకు తరలించే ప్రయత్నాలు చేస్తుంటే.. మరో పక్క ఇక్కడ షాపులను ఎలాగైనా దక్కించుకునేందుకు కూటమికి చెందిన కార్పొరేటర్లంతా వేలంపాట జరిగే కాన్ఫరెన్స్ హాల్‌లో పాగా వేశారు. బినామీలను పెట్టుకుని షాపులను దక్కించుకునేందుకు పావులు కదిపారు. బయట వ్యక్తులు ఎవరైనా వేలం పాటలో పాల్గొంటున్నారని తెలిస్తే వారి వద్దకు వెళ్లి బేరసారాలు జరుపుకుని, రాకుండా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బైపాస్‌కు తరలించేందుకు యత్నాలు

షాపుల లీజుదారులంతా సిండికేట్‌గా తయారై కొత్త ఎత్తుగడ వేశారు. వేలం పాటకు దూరంగా ఉండటంతో పాటు కరోనా సమయంలో ఏటుకూరు, బుడంపాడు బైపాస్ మధ్యలో ఏర్పాటు చేసిన స్థలానికి మార్కెట్ తరలించేందుకు అసోసియేషన్ పెద్దలు చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా సదరు స్థల యజమానికి ఏడాదికి లీజు కింద రూ.85.50లక్షలు చెల్లించి, అక్కడికి వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ మొత్తాన్ని ముందుగానే అడ్వాన్స్ కింద చెల్లించాలని స్థల యజమాని చెప్పడంతో అసోసియేషన్ పెద్దలు లీజుదారుల వద్దకు వెళ్లి, ఒక్కో షాపునకు రూ.50వేల నుంచి రూ.లక్ష దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. పైగా సోమవారం ఏటుకూరు, బుడంపాడు బైపాస్ వద్ద ఉన్న స్థలంలో మార్కెట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.

డాక్టర్ సుమితా శంకర్ ఆవిష్కరణకు పేటెంట్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్ ఆవిష్కరించిన 'నెగటివ్ ప్రెషర్ ఆధారిత లింబ్ డీకాంజెషన్ స్లీవ్'కు పేటెంట్ లభించింది. ఈ మేరకు సోమవారం కేంద్ర ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం నుంచి ఆమె అభివృద్ధి చేసిన వైద్య పరికరం (డిజైన్ నం. 459230-001)కు సర్టిఫికెట్ లభించింది. ఈ వినూత్న పరికరం చేతులు, కాళ్ల వాపు, వెనస్ కాంజెషన్, సంక్లిష్ట గాయాల చికిత్సలో కొత్త మార్గాన్ని అందిస్తుంది. నియంత్రిత నెగటివ్ ప్రెషర్ ద్వారా వాపును తగ్గించడం, రక్తప్రసరణ మెరుగుపరచడం, గాయాల మాన్పును వేగవంతం చేయడం దీని ప్రధాన లక్ష్యం. ఈ పరికరాన్ని డాక్టర్ కృతి నందూరి సహ ఆవిష్కర్తగా వ్యవహరించారు. డాక్టర్ సుమితా శంకర్ తక్కువ ఖర్చుతో, రోగులకు అనుకూలమైన, గ్రామీణ, పట్టణ ఆరోగ్య సేవలకు అందుబాటులో ఉండే విధంగా పరికరాన్ని రూపకల్పన చేశారు. తన ఆవిష్కరణకు పేటెంట్ లభించిన సందర్భంగా డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ ఈ గుర్తింపు కేవలం డిజైన్ రక్షణ మాత్రమే కాదని, గాయాల సంరక్షణలో కొత్త ఆశలు తెరవడమేనని పేర్కొన్నారు. డివైస్ యాక్ట్ – 2000 ప్రకారం పది సంవత్సరాల పాటు ఈ డిజైన్ పేటెంట్ ఉంటుందని, దీన్ని గరిష్ఠంగా 15 సంవత్సరాల వరకు పొడిగించవచ్చని తెలిపారు. దీని ద్వారా ఆవిష్కర్తలు పరికరాన్ని మరింత అభివృద్ధి చేసి, మార్కెట్ చేసుకునేందుకు ప్రత్యేక హక్కులను పొందుతారని పేర్కొన్నారు. ఇకపై తమ బృందం క్లినికల్ ధ్రువీకరణ, అకడమిక్ ప్రచురణలు, సహకారాలు ద్వారా దీన్ని మరింత విస్తరించడానికి యోచిస్తోందని డాక్టర్ సుమితా శంకర్ వెల్లడించారు.



ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

బల్లికురవ: ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని బాపట్ల జిల్లా అడిషనల్ డీపీఎం మోహన్ తెలిపారు. సోమవారం నక్కబొక్కలపాడు గ్రామంలో ఎన్‌పీఎం షాపులో కషాల తయారీని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. పంటల సాగులో చీడపీడల నివారణకు అవసరమైన కషాయాలను ముందుగానే తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం సాగు వైపు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి రైతు తనకున్న భూమిలో కొంత భాగంలోనైనా ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. మాస్టర్ ట్రైనర్ అప్పారావు, ప్రకృతివ్యవసాయ ఇన్‌చార్జి కల్పన ఉన్నారు.


కషాయాల తయారీని పరిశీలిస్తున్న డీపీఎం

రేపల్లెలో బార్ల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

రేపల్లె: రేపల్లె పట్టణంలో నాలుగు బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025 అక్టోబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31వ తేదీ వరకు మూడు సంవత్సరాలపాటు బార్ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఈనెల 18 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు చేసుకునేవారు రూ.5 లక్షలు నాన్ రిఫండబుల్ ఫీజు, రూ.10,000 అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని తెలిపారు. బార్లకు అందిన దరఖాస్తులను ఈనెల 28న ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ సమక్షంలో బాపట్లలో లాటరీ విధానంలో ఎంపిక చేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 94409 02476 నంబరులో సంప్రదించాలన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలకు దరఖాస్తుల స్వీకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఈ నెల 22వ తేదీన సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఆచరించనున్నారు. అమ్మవారి సన్నిధిలో జరిగే ఈ వ్రతాల్లో పాల్గొనే మహిళలకు దేవస్థానం ఉచితంగా దరఖాస్తులను పంపిణీ చేస్తోంది. మంగళవారం వరకు భక్తులకు దరఖాస్తులు అందజేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను 20వ తేదీ సాయంత్రానికి దేవస్థానం టోల్‌ఫ్రీ కౌంటర్‌లో అందజేయాలని సూచించారు. తెల్లరేషన్ కార్డు కలిగిన భక్తులు తమ రేషన్ కార్డు జిరాక్స్ కాపీని కౌంటర్‌లో చూపించి దరఖాస్తును పొందాలని పేర్కొన్నారు. 22వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు సామూహిక వరలక్ష్మీవ్రతం ప్రారంభమవుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. వ్రతం అనంతరం భక్తులకు దేవస్థానం ప్రసాదం కిట్‌లను అందజేస్తుంది. వ్రతంలో పాల్గొన్న మహిళలకు రూ.100 క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు.

నూతన బార్ పాలసీని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు



బాపట్లటౌన్: నూతన బార్ పాలసీ విధానాన్ని ఆసక్తి కలిగిన వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న 2022–2025 బార్ పాలసీను రద్దుచేసి 2025–2028 సంవత్సరాలకుగానూ నూతన బార్ పాలసీని విడుదల చేసిందన్నారు. బాపట్ల మున్సిపాలిటీ–04 , చీరాల మున్సిపాలిటీ –07, రేపల్లె మున్సిపాలిటీ–04, అద్దంకి నగర పంచాయతీ–01 చొప్పున 17 బార్ ఉన్నాయన్నారు. వీటితోపాటు గీత కులాలకు సంబంధించి బాపట్ల మున్సిపాలిటీ–01, రేపల్లె మున్సిపాలిటీ–01 రెండుతో కలిపి మొత్తం 19 బార్ ఉన్నాయన్నారు. బార్‌లకు కేటాయింపు పాత పద్ధతిలోని వేలం ద్వారా కాకుండా, ఏ–4 షాపులకు జరిపిన విధంగా డ్రా ఆఫ్ లాట్స్ (చీటీలు) ద్వారా జరపబడుతుందన్నారు. డ్రా ఆఫ్ లాట్స్‌లో పాల్గొనే అభ్యర్థులు రూ.5 లక్షల దరఖాస్తు ఫీజును, రూ.10,000 ప్రాసెస్సింగ్ ఫీజును ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ హైబ్రిడ్ పద్ధతి ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులపై ఎటువంటి పరిమితి లేదని, ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చన్నారు. దరఖాస్తు సమర్పించేందుకు ఆఖరు తేదీ ఈనెల 26 వరకు గడువు ఉందన్నారు. లైసెన్స్ ఫీజును ఒకేసారి కాకుండా ఆరు సమాన వాయిదాల ద్వారా చెల్లించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. నూతన బార్ పాలసీ ద్వారా బార్‌ల టైమింగ్స్ అదనంగా మూడు గంటలు పొడిగించి, ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు బార్‌లు నడుపుకునేందుకు ప్రభుత్వం సడలింపు చేసిందన్నారు.


15 మండలాల్లో మోస్తరు వర్షం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లాలోని 15 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా కాకుమాను మండలంలో 37.2 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు పశ్చిమలో 0.6 మి.మీ. పడింది. సగటున 8.3 మి.మీ. నమోదైంది.

పిడుగు గుట్టు.. పసిగట్టు !

- వర్షాకాలంలో పిడుగులతో పొంచి ఉన్న ముప్పు
- ప్రాణాలపై పిడుగుపాటు
- 'దామిని లైట్నింగ్' యాప్‌తో పిడుగుల ముందస్తు హెచ్చరికలు
- జాగ్రత్తలు పాటిస్తే బయటపడవచ్చంటున్న నిపుణులు

బెల్లంకొండ: వర్షాకాలం వచ్చిందంటే ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుంటాయి. పిడుగులు కూడా పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పిడుగు ఎప్పుడు పడుతుందో.. ఎలా పడుతుందో తెలియని పరిస్థితిలో ప్రమాదాలు వాటిల్లి ఒక్కోసారి ప్రాణ నష్టం కూడా సంభవిస్తుంది. అదేవిధంగా మెరుపుల దాటికి గృహోపకరణాలు కూడా కాలిపోతూ ఉంటాయి. పిడుగులోని కాంతి ప్రభావంతో నష్టం భారీగానే కలుగుతుంది. ఈ పరిస్థితుల్లో పిడుగు నుంచి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ ఎప్పటికప్పుడు మెసేజ్‌ల రూపంలో హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంటుంది. పిడుగుపాటును ముందే తెలుసుకోగలిగితే ప్రాణాలు కాపాడుకోవచ్చు. ఈ పిడుగు ప్రమాదాన్ని 'దామిని లైట్నింగ్ యాప్'తో అరగంట ముందే గుర్తించగలిగే అవకాశం ఉంది.



ముప్పు ముందే తెలుసుకోవచ్చు

పూణె కేంద్రంగా ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ (ఐఐటీఎం) నాలుగేళ్ల క్రితం ఈ యాప్‌ను రూపొందించింది. పిడుగుపాటును గుర్తించేందుకు దేశవ్యాప్తంగా వివిధ నగరాలలో 83 చోట్ల ప్రత్యేక సెన్సార్లను అమర్చారు.

- ముందుగా ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆపిల్ యాప్ స్టోర్ లోకి వెళ్లి.. దామిని లైటింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

రంగును బట్టి హెచ్చరిక

రెడ్ కలర్ : మీరు ఉన్న ప్రాంతంలో మరో ఏడు నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి మారుతుంది.

ఎల్లో కలర్: మరో 10 నుంచి 15 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే యాప్ లోని సర్కిల్ పసుపు కలర్ లోకి మారుతుంది.

నీలం కలర్ : 15 నుంచి 25 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ బ్లూ కలర్‌లోకి మారిపోతుంది.

- తర్వాత పేరు, మొబైల్ నెంబర్, అడ్రస్, పిన్‌కోడ్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. జీపీఎస్ లోకేషన్ తెలుసుకోవడం కోసం యాప్‌కు పర్మిషన్ ఇవ్వాలి.
- మీ ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో లేదో తెలుసుకోవడానికి మూడు రంగులను ఐడెంటిఫికేషన్ కలర్స్ కింద చూపిస్తుంది. వాటి ఆధారంగా మీరు ఉన్నచోట పిడుగు పడే అవకాశం ఉంటే ముందే హెచ్చరిస్తుంది.

కాపర్ ఎర్త్‌వైర్‌తో ప్రమాదాలకు చెక్..

ఇంటి పరిసర ప్రాంతాల్లో పిడుగుపాటు నుంచి కాపర్ ఎర్త్ వైర్ ఏర్పాటుతో తప్పించుకునే అవకాశం ఉంది. ఇంటి ఆవరణలో కొంత ఎత్తయిన ప్రదేశం నుంచి నేరుగా భూమిలోకి కాపర్ ఎర్త్ (రాగి వైర్ ను అనుసంధానం చేస్తూ భూమిలోకి పాతాలి) ఏర్పాటు చేయడం ద్వారా దాదాపుగా కిలోమీటర్ దూరంలో పడిన పిడుగును నేరుగా భూమిలోకి ఇదే ఆకర్షించుకుంటుంది. ఎర్త్ వైర్‌ను ఉప్పు, కర్ర బొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్‌ను భూమి లోపలికి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు..



- వర్షం వచ్చేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు. ముఖ్యంగా ఎత్తయిన చెట్ల కింద అస్సలు ఉండకూడదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల వద్ద బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు.
- లక్షల డిగ్రీల ఉష్ణోగ్రతతో విడుదలయ్యే వేడి ఒక్కసారిగా మనిషిని చేరగానే గుండెపై ప్రభావం చూపుతుంది.
- వర్షపు సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోల్టులు, సెల్‌ఫోన్లు, కెమెరాలు దగ్గర లేకుండా చూసుకోవాలి. ఫోన్ల నుంచి వచ్చే సిగ్నల్ పిడుగు పడే అవకాశాన్ని ఎక్కువ చేస్తుంది.
- మెరుపులు, పిడుగుల వల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోయే అవకాశం ఉంది. ఆ సమయంలో టీవీలకు ఉన్న విద్యుత్, కేబుల్ కనెక్షన్లు తొలగించాలి.
- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్స్ సమీపంలో ఉండకూడదు. తడి ప్రదేశాల్లో ఉండకపోవడం చాలా మంచిది.

అప్రమత్తంగా ఉండాలి

వాతావరణంలో మార్పులు జరిగి వర్షాలు పడుతున్న సమయంలో బయటకు వెళ్లకుండా పనులు ఆపుకొంటే మంచిది. అత్యవసర పనులు ఉండి వర్షంలో బయటకు వెళ్లిన సమయంలో దామిని లైటింగ్ యాప్ ఉపయోగించి పిడుగు ఎక్కడ పడుతుందో.. ఏ సమయంలో పడుతుందో పసికట్టవచ్చు. తద్వారా ప్రమాదానికి గురికాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

– ప్రవీణ్ కుమార్, తహసిల్దార్, బెల్లంకొండ

ఉచిత ఉపకరణాలు వినియోగించుకోండి

పల్నాడు జిల్లా సహిత విద్య సమన్వయకర్త సెల్వరాజ్


ఉపకరణాల నిర్ధారణ పరీక్షలు చేస్తున్న డాక్టర్ నితిన్

పెదకూరపాడు: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ప్రభుత్వం అందించే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా సహిత విద్య సమన్వయకర్త సెల్వరాజ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. సెల్వరాజ్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో 520 మంది విద్యార్థులు భవిత పాఠశాలలో ఉన్నారని తెలిపారు. వారిలో ఉపకరణాల అవసరమైన వారికి నిర్ధారణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆడియాలజిస్ట్, సైకాలజిస్ట్, ఆర్థోపెడిక్ సంబంధించిన ప్రత్యేక ప్రతిభావంతులను ఢిల్లీ నుంచి వచ్చిన వైద్య బృందం ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకారణాలను అందించేలా ప్రభుత్వానికి నివేదిక ఇస్తారన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన వైద్య బృందం డాక్టర్ నితీష్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏకుల ప్రసాదరావు, సత్యనారాయణ, హెచ్‌ఎం కేవీ రమణ, స్కూల్ అసిస్టెంట్లు సుబ్బారావు, సుశితాప్రియ, లక్ష్మీనారాయణ, నూర్జహాన్, అచ్చయ్య, నసీమా బిగ్, బాబు, ఐఈఆర్పీ టీచర్లు లక్ష్మి, కమల, స్వాతి, రమాదేవి, రహీం తదితరులు పాల్గొన్నారు.